క్లుప్తంగా

మండపాల్లో పూజలు



టేకులపల్లి: దీపాలు వెలిగించిన భక్తులు

ఇల్లెందు/టేకులపల్లి: పలు వినాయక మండపాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. సోమవారం పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.
ఇల్లెందురూరల్: గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో గణనాథుడికి సోమవారం పూజలు నిర్వహించారు. హనుమంతులపాడు గ్రామంలో మహిళలు భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజ చేశారు.

రెండో రోజు 14 నామినేషన్లు

పాల్వంచ: కేటీపీఎస్ ఉద్యోగుల క్రెడిట్ సొసైటీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ సోమవారం రెండో రోజుకు చేరుకుంది. 14 మంది ఉద్యోగులు బరిలో నిలిచేందుకు నామినేషన్లను ఎన్నికల అధికారి జి.గంగాధర్, జిల్లా కోఆపరేటివ్ అధికారి ఎ.శ్రీనివాస్‌కు సమర్పించారు. తొలి రోజు 23 మంది నామినేషన్లు వేయగా మొత్తం ఇప్పటి వరకు 37 నామినేషన్లు దాఖలయ్యాయి.

కొనసాగుతున్న శిబిరం

కొత్తగూడెంఅర్బన్: దివ్యాంగ బాలల నిర్ధారణ శిబిరం రెండో రోజైన సోమవారం కూడా కొనసాగింది. షెడ్యూల్ ప్రకారం 7 మండలాలకు (ఆళ్లపల్లి, అశ్వారావుపేట, భద్రాచలం, దమ్మపేట, గుండాల, టేకులపల్లి, ఇల్లెందు) సంబంధించిన దివ్యాంగులు శిబిరానికి హాజరయ్యారు. వీరికి అలింకో డాక్టర్ల చేత పరీక్షలు నిర్వహించి అర్హత కలిగిన వారి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. మంగళవారం కూడా శిబిరం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రియవర్మ, వికాస్‌వర్మ, మంగీలాల్, సురేశ్‌కుమార్, శ్యామల, కళ్యాణి, శ్రీరామ్, సంతోష్‌కుమార్, కనకదుర్గ, సుమలత, జానకి, మోహన్ పాల్గొన్నారు.

బురదలో నాటేసి నిరసన

సుజాతనగర్: 23వ డివిజన్ పరిధిలోని వేపలగడ్డ గ్రామంలో బురదమయంగా మారిన వీధిని ఎవరూ పట్టించుకోవడం లేదని పేర్కొంటూ కాలనీ వాసులు సోమవారం రోడ్డుపై బురదలో నాటేసి నిరసన తెలిపారు. కాల్వల్లో చెత్త చెదారం పేరుకుపోయి దోమలకు ఆవాసంగా మారిందని తెలిపారు. కార్యక్రమంలో బచ్చలకూర శ్రీనివాస్, ఉడుగుల శ్రీకాంత్, యాకన్న, లింగయ్య, ఉప్పలయ్య, అశోక్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ పర్యటనను జయప్రదం చేయాలి

పాల్వంచ: ఈ నెల 10, 11 తేదీల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జిల్లాలో పర్యటిస్తారని, దీనిని విజయవంతం చేయాలని పార్టీ సీనియర్ నాయకుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కిలారు నాగేశ్వరరావు కోరారు. సోమవారం స్థానిక గట్టాయిగూడెంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. మల్లెల శ్రీరామమూర్తి, దాసరి నాగేశ్వరరావు, కనగాల బాలకృష్ణ, మల్లెల రవీచంద్ర, కొంచర్ల రామకృష్ణ, భట్టు మంజుల, సమ్మయ్యగౌడ్, సురేష్, శ్రీను, దుర్గాప్రసాద్, శేఖర్, రామారావు, గిరి పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్యశిబిరాలు

జూలూరుపాడు: మండలంలోని వాగొడ్డుతండా, గోపాతండా, మాచినేనిపేట గ్రామాల్లో సోమవారం జూలూరుపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి బి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో విషజ్వరాలు ప్రబలడంతోపాటు డెంగీ కేసులు నమోదవడంతో డాక్టర్ వెంకటేశ్వర్లు వైద్యశిబిరం ఏర్పాటు చేసి ప్రజలకు వైద్యసేవలు చేశారు. ప్రస్తుతం డెంగీ బాధితుల ఆరోగ్య పరిస్థితి కుదటపడిందని, ఎలాంటి ఇబ్బంది లేదని వైద్యాధికారి చెప్పారు. అనంతరం ఆయన కాకర్ల గ్రామంలోని ఓ గ్రామీణ వైద్యుడి క్లినిక్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థాయికి మించి వైద్యం చేయొద్దని హెచ్చరించారు. సీహెచ్ఓ ఎం.రామకృష్ణ, హెల్త్ అసిస్టెంట్ కృష్ణ, ఏఎన్ఎం జీజ పాల్గొన్నారు.

వసతులు కల్పించాలి

సుజాతనగర్: సీతంపేట గ్రామ పంచాయతీ పరిధిలోని కాసాని లక్ష్మీనగర్‌లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. పార్టీ మండల కార్యదర్శి వీర్ల రమేశ్ మాట్లాడుతూ.. గ్రామంలో ఇంటి నంబర్లు కేటాయించకపోవడంతో విద్యుత్ మీటర్లు పొందే పరిస్థితి లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో బచ్చలకూర శ్రీనివాస్, శంకర్, నాగయ్య, వెంకటనారాయణ, లక్ష్మీ, సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు ధర్నా

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) ఆధ్వర్యాన మంగళవారం ధర్నా నిర్వహించనున్నారు. కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట ఈ ధర్నా జరుగుతుందని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ తెలిపారు.

యూరియా.. ఇవ్వండయ్యా



యూరియా కోసం జూలూరుపాడు పీఏసీఎస్ వద్ద బారులు తీరిన రైతులు

- యూరియా కోసం రైతుల కష్టాలు
- ప్రస్తుత తరుణంలో పంటలకు యూరియా అత్యవసరం
- సరిపడా లభించక ఇబ్బందులు



రైతులకు రశీదులు ఇస్తున్న సహకార సిబ్బంది

జూలూరుపాడు: వానాకాలం పంటలకు అవసరమైన యూరియా కోసం రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. యూరియా అధికంగా వినియోగించే పత్తి, వరి, మొక్కజొన్న పంటలకు సరిపడా దొరక్కపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పత్తి, వరి, మొక్కజొన్న పంటలకు 15 రోజులకు రైతులు ప్రతి ఎకరానికి ఒక బస్తా నుంచి రెండు బస్తాల చొప్పున యూరియా వినియోగిస్తారు. కానీ, లభ్యత లేక ఏం చేయాలో పాలుపోని స్థితి ఎదురవుతోంది.

పీఏసీఎస్ వద్ద బారులు

జూలూరుపాడు పీఏసీఎస్ వద్ద సోమవారం కూడా యూరియా కోసం వందలాది మంది రైతులు బారులుదీరారు. వారం, పది రోజులు, పదిహేను రోజుల క్రితం పీఏసీఎస్‌లో ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్‌లు ఇచ్చి వెళ్లిన రైతులకు తోడు ఇంకొందరు రావడంతో రద్దీ ఏర్పడింది. పీఏసీఎస్‌లో ప్రస్తుతం 220 బస్తాలే నిల్వ ఉండగా.. పోలీస్ బందోబస్తు నడుమ ఒక్కో బస్తా చొప్పున పంపిణీ చేశారు. ఎంత భూమి ఉన్నా ఒక్క బస్తానే ఇవ్వడం.. అదీ అందరికీ దొరక్కపోవడంతో రైతులు ఆవేదనగా వెనుతిరిగారు. అలాగే, వారం క్రితం ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్‌లు ఇచ్చి వెళ్లి ఇప్పుడు వస్తే కాగితాలు లేవని అధికారులు చెప్పారని, రెండు, మూడు రోజుల తరువాత రమ్మని చెప్పారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సరిపడా యూరియా ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆధార్, పట్టా పాస్ బుక్ ఇచ్చి వెళ్లా..



గత 20 రోజుల క్రితం యూరియా నాలుగు బస్తాలు తీసుకెళ్లాం. మళ్లీ అవసరమైతే వారం క్రితమే ఆధార్ కార్డు, పట్టా పాస్‌బుక్ జిరాక్స్ ఇచ్చి వెళ్తే ఇప్పుడు రెండు బస్తాలే ఇచ్చారు. ఐదున్నర ఎకరాల్లో పత్తి, వరి సాగు చేస్తే ఎకరానికి మూడు బస్తాల యూరియా అవసరం. ప్రైవేట్ దుకాణాల్లో కూడా దొరకక ఇబ్బంది పడుతున్నాం.

–గుగులోత్ బుజ్జి, రైతు, అన్నారుపాడు

ఐదు సార్లు వచ్చినా దొరకలేదు



యూరియా కోసం ఐదు సార్లు వచ్చినా ఖాళీగా వెళ్లాల్సి వచ్చింది. ఆధార్‌కార్డు, పాస్‌పుస్తకం జిరాక్స్ ఇచ్చి వారం తర్వాత రమ్మనడంతో ఇప్పుడు వచ్చా. పీఏసీఎస్‌లో లేకపోవడంతో ఒక్కో యూరియా బస్తా రూ.400 చొప్పున రెండు బస్తాలు మరొకరి వద్ద కొనుగోలు చేశా. ప్రభుత్వం స్పందించి సరిపడా యూరియా ఇవ్వాలి.

–బానోత్ సక్కులాల్, రైతు, కొమ్ముగూడెం

చెరువును తలపించేలా రహదారి



చుంచుపల్లి: వరద నీటిని పరిశీలిస్తున్న నాయకులు

చుంచుపల్లి: చెరువును తలపించే విధంగా విద్యానగర్ ప్రధాన రహదారి ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు విద్యానగర్ ప్రధాన రహదారిపై నీరు నిల్వగా సోమవారం సీపీఎం బృందం సందర్శించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చింతలచెరువు నుంచి వస్తున్న వరద, అలాగే వర్షపు నీరు రామవరం గోధుమ వాగులో కలవకుండా డ్రెయినేజీలు ఆక్రమించి బిల్డింగులు నిర్మించడంతో నడిరోడ్డుపై పారుతోందని మండిపడ్డారు. ప్రయాణికులు, చుట్టుపక్కల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పంచాయతీ అధికారులు పరిశీలించకుండా అనుమతులు ఇచ్చారని నిర్మించారని ఆరోపించారు. ఏజెన్సీ చట్టాలకు తూట్లు పొడిచి నిబంధనలకు విరుద్ధంగా అక్రమ కట్టడాలు కడుతున్నప్పటికీ అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. పంచాయతీ అధికారి స్పందించి డ్రెయినేజీలపై నిర్మించిన భవనాలను తొలగించాలని, డ్రెయినేజీలు రోడ్డుపై నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లిక్కి బాలరాజు, భూక్యా రమేశ్, సందకూరి లక్ష్మి, నందిపాటి రమేశ్, కేహెచ్ ప్రసాద్, ఎంఎస్ ప్రకాశ్, మందా నాగకృష్ణ, ప్రమోద్, సతీశ్, కిశోర్ పాల్గొన్నారు.

ఎస్‌సీబీ నగర్‌లోకి భారీగా వరదనీరు

సూపర్‌బజార్(కొత్తగూడెం): రామవరం ఎస్‌సీబీనగర్‌లో ఆదివారం రాత్రి నుంచి కురిసిన భారీ వర్షానికి వరద చేరడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు. సోమవారం ఉదయం సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా ఆ ప్రాంతంలో పరిశీలించి మున్సిపల్ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో మోటార్ల ద్వారా నీరు తొలగించడంతో పాటు సైడ్ డ్రెయిన్లు శుభ్రం చేయించారు.

కాలనీ వాసులను ఆదుకోవాలి

సింగరేణి(కొత్తగూడెం): భారీ వర్షంతో నష్టపోయిన కొత్తగూడెంలోని నెహ్రూ బస్తీ, కొమరంభీం కాలనీ ప్రజలను ఆదుకోవాలని సీపీఎం టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు డిమాండ్ చేశారు. వర్షంతో నీట మునిగిన ఇళ్లను సోమవారం పరామర్శించిన ఆయన మాట్లాడారు. కిన్నెరసాని పైపులైన్‌లో చెత్తాచెదారం పేరుకుపోయి నీరు పోటెత్తడంతో ఇళ్లలోకి చేరగా సామగ్రి నష్టపోయారని తెలిపారు. నష్టపరిహారం చెల్లించి పక్కా ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

కొత్తగూడెం ఎంఈఓగా మధురవాణి



మధురవాణిని సన్మానిస్తున్న దృశ్యం

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం ఎంఈఓగా మధురవాణి సోమవారం బాధ్యతలు చేపట్టారు. పాతకొత్తగూడెంలోని మండల విద్యాశాఖ కార్యాలయంలో గత ఎంఈఓ ప్రభుదయాళ్, సిబ్బంది మధురవాణికి శుభాకాంక్షలు తెలిపారు. పలు పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో తేజోన్నతరెడ్డి, లక్ష్మి, ఖాసీంపాషా, అర్జున్, నగేశ్, సతీశ్, కిరణ్మయి, విజయ పాల్గొన్నారు.

పాల్వంచవాసికి పురస్కారం



బాషాను సన్మానిస్తున్న నిర్వాహకులు

పాల్వంచ: పాల్వంచకు చెందిన గద్దర్ బాషాకు జానపద పురస్కారం లభించింది. గత నెల 31న ప్రపంచ జానపద దినోత్సవాలను హైదరాబాద్ రవీంద్రభారతిలో రాష్ట్ర జానపద కళాకారుల సంఘం ఆధ్వర్యాన నిర్వహించారు. కార్యక్రమంలో బాషా పురస్కారం అందుకోగా, సోమవారం స్థానిక కళాకారులు కొమరయ్య, జానకీరామ్, ఖాసీం, శ్రీను, వెంకన్న, నందులు అభినందించారు.

బియ్యం వితరణ

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఇటీవల ఆకస్మికంగా మరణించిన ఆటోవర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు సూరిమేని జనార్దన్ కుటుంబానికి తోటి ఆటోడ్రైవర్లు సోమవారం రెండు క్వింటాళ్ల బియ్యాన్ని వితరణగా అందజేశారు. కార్యక్రమంలో రామవరం ఆటో అడ్డా అధ్యక్షుడు ఎస్‌కె జలీల్, మాతా శిశు అడ్డా అధ్యక్షుడు బడుగు భాస్కర్, జిల్లా కార్యదర్శి మర్రి కృష్ణ, మునిగడప వెంకటేశ్వర్లు, నరేందర్, యూనియన్ నాయకులు హమీద్, బాబుఖాన్, హరినాథ్, ఎస్‌కె జానీ, సందే శ్రీనివాస్, బాషా తదితరులు పాల్గొన్నారు.

35 మంది కార్మికులకు పదోన్నతి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియాలో 35 మంది కార్మికులకు పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా సోమవారం వారికి ఏరియా జీఎం శాలేంరాజు ఉత్తర్వులు అందజేసి మాట్లాడారు. ఏరియాలోని ఎన్‌సీడబ్ల్యూఏ ఉద్యోగులకు ఈ నెల 1వ తేదీ నాటికి అర్హత సాధించినవారు పదోన్నతులు పొందారని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, వివిధ విభాగాల ఉద్యోగులు రజాక్, గట్టయ్య, సూర్యనారాయణరాజు, జీ.వీ.మోహన్‌రావు, రామ్ భరోసా మహా తదితరులు పాల్గొన్నారు.

బెడ్లు, నెబులైజర్ల అందజేత



టేకులపల్లి: సామగ్రి అందజేస్తున్న ప్రతినిధులు

టేకులపల్లి/ఇల్లెందురూరల్: థాయిలాండ్‌కు చెందిన సీపీ సీడ్స్ కంపెనీ తరఫున సామాజిక బాధ్యత(సీఎస్ఆర్)లో భాగంగా టేకులపల్లి మండలంలోని సులానగర్ పీహెచ్‌సీకి సోమవారం ఎనిమిది చొప్పున మంచాలు, పరుపులు, రెండు నెబులైజర్లు, రెండు సెలైన్ స్టాండ్లు అందజేశారు. అలాగే, ఇల్లెందు మండలం రొంపేడు పీహెచ్‌సీకి ఎనిమిది మంచాలు, రెండు నెబలైజేషన్ యంత్రాలను అందించారు. వైద్యాధికారులు కందుల దినేశ్, కంచర్ల వెంకటేశ్, కవిత మాట్లాడుతూ.. సామాజిక బాధ్యతగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కంపెనీ బాధ్యులకు కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు. కంపెనీ డీఎం బిజ్జంకి రాజశేఖర్, డీలర్లు, వ్యాపారులు నాగినేని నరసింహారావు, రాఘవ, నాళ్ల సోమసుందర్, నారాయణదాస్ లాహోటి, వ్యాయసాని జనార్దన్, సందిరి రమేశ్, పుల్లఖండం ఉపేందర్, ప్రతాపని శ్రీను, ఎమ్మెల్యే కనకయ్య సతీమణి లక్ష్మి, పీహెచ్‌సీ ఉద్యోగులు దేవా, వజ్జా పార్వతి, రాజు, కిరణ్‌కుమారి, జగదాంబ, నాగుబండి, పోరండ్ల రజిత, రమేశ్ పాల్గొన్నారు.

డ్రెయినేజీ సమస్యకు త్వరలో పరిష్కారం



సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ సుజాత

సుజాతనగర్: మండల కేంద్రంలో నెలకొన్న సైడ్ డ్రెయినేజీ సమస్యకు త్వరలోనే పరిష్కారం చూపిస్తామని కొత్తగూడెం కార్పొరేషన్ కమిషనర్ సుజాత తెలిపారు. వర్షాల నేపథ్యంలో మండల కేంద్రంలో వరద నీరు నిలిచిన పలు ప్రదేశాలను సోమవారం ఆమె పరిశీలించారు. ఖాళీ స్థలాల్లో నీరు నిలిస్తే అందుకు బాధ్యులు ఆ స్థల యాజమానులేనని చెప్పారు. కాగా, సైడ్ డ్రెయినేజీ పూడుకొని పోవడంతో వర్షపు నీరంతా ఇళ్లలో చేరుతోందని కమిషనర్‌కు తెలిపారు. సమస్యను తొందర్లోనే పరిష్కరిస్తామని, ఖాళీ స్థలాల యాజమానులకు నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈ రవికుమార్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌చౌహాన్ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై ధర్నా

సూపర్‌బజార్(కొత్తగూడెం): విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృథ్వీ మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరించకుండా గాలికి వదిలేసిందని విమర్శించారు. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం విద్యాశాఖాధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మునిగెల శివప్రశాంత్, రామ్‌చరణ్, అబ్దుల్‌గని, జార్జ్, విష్ణువర్దన్, శ్రావణి, సంధ్య, భవాని తదితరులు పాల్గొన్నారు.

రేపు చలో కలెక్టరేట్

సింగరేణి(కొత్తగూడెం): ఈ నెల 3న నిర్వహించనున్న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మంద నాగకృష్ణ, కార్యదర్శి బయ్య అభిమన్యు సోమవారం కోరారు.

సహనం నశించి రోడ్డెక్కిన రైతులు



ఇల్లెందురూరల్: కొమరారంలోని కేంద్రం వద్ద క్యూలైన్‌లో పెట్టిన కవర్లు



టేకులపల్లి: ధర్నా చేస్తున్న రైతులు, నాయకులకు నచ్చజెబుతున్న పోలీసులు

ఇల్లెందురూరల్/టేకులపల్లి: రెండు రోజులుగా యూరియా పంపిణీ జరగకపోగా రైతులు సోమవారం తెల్లవారక ముందే విక్రయ కేంద్రానికి చేరుకుని ఆధార్ జిరాక్స్‌లను క్యూలో పెట్టారు. ఇల్లెందు మండలంలోని కొమరారంలోని కేంద్రం వద్దకు పెద్దసంఖ్యలో రైతులు చేరుకున్నా యూరియా ఇస్తారో, లేదో చెప్పకపోవడంతో ఆందోళనకు దిగారు. న్యూడెమోక్రసీ నాయకులు వీరికి మద్దతు తెలపడంతో వాహనాలు నిలిచిపోయాయి. దీంతో కొమరారం ఎస్ఐ నాగుల్‌మీరాపతాన్ చేరుకొని నచ్చజెప్పే ప్రయత్నం చేసినా ససేమిరా అన్నారు. చివరకు ఏఓ సతీశ్ వచ్చి మంగళవారం యూరియా విక్రయాలు ప్రారంభిస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. ఇక టేకులపల్లి మండలం బేతంపూడి సొసైటీ కార్యాలయంలో, బోడు, బొమ్మనపల్లి గ్రామాలకు సంబంధించి యూరియా పాయింట్లు ఏర్పాటు చేయడంతో సోమవారం ఉదయమే రైతులు చేరుకున్నారు. కానీ, స్టాక్ లేదని, వస్తే ఇస్తామని సొసైటీ బాధ్యులు చెప్పడంతో పది గంటల వరకు చూసిన రైతులు టేకులపల్లి బస్టాండ్ సెంటర్‌లో న్యూడెమోక్రసీ ఆధ్వర్యాన ధర్నాకు దిగారు. నాయకులు కల్తి వెంకటేశ్వర్లు, బాణోతు ఊక్లా మాట్లాడుతూ రైతుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం వెంటనే యూరియా సరఫరా చేయాలని కోరారు. సుమారు అరగంట పాటు ధర్నా జరగగా పోలీసులు నచ్చజెప్పడంతో మళ్లీ సొసైటీ వద్దకు వెళ్లారు. కానీ మంగళవారమే యూరియా వస్తుందని చెప్పడంతో నిరాశగా వెనుదిరిగారు.

ఇల్లెందులో రెండు వర్గాలుగా నిరసన



దిండిగాల రాజేందర్ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు



హరిప్రియ ఆధ్వర్యాన అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇల్లెందు: ఇల్లెందు బీఆర్ఎస్‌లో వర్గపోరు మొదలైంది. కాళేశ్వరం ప్రాజెక్టు విచారణను సీబీఐకి అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై బీఆర్ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఇల్లెందులో నిరసన తెలిపారు. అయితే, పార్టీ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు దిండిగాల రాజేందర్ ఆధ్వర్యాన తెలంగాణ తల్లి విగ్రహం వద్ద సోమవారం మొదటగా ఆందోళన నిర్వహించారు. ఇక మాజీ ఎమ్మెల్యే హరిప్రియ ఆధ్వర్యాన ఆ తర్వాత కొత్త బస్టాండ్, జేకే సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలపడం గమనార్హం. కార్యక్రమాల్లో దిండిగాల రాజేందర్, హరిప్రియ మాట్లాడుతూ.. కాళేశ్వరం విచారణ పేరుతో కాంగ్రెస్, బీజేపీ కుట్ర పన్నాయని ఆరోపించారు. ఈ విషయాలను తెలంగాణ సమాజం గమనిస్తోందని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు అబ్దుల్ నబీ, ఎండీ జబ్బార్, వసంత్, లలిత్ పాసీ, సన రాజేశ్, రాజశేఖర్, లకావత్ దేవీలాల్ నాయక్, సిలివేరు సత్యనారాయణ, పరుచూరి వెంకటేశ్వర్లు, జేకే శ్రీనివాస్, శీలం రమేశ్, రేణుక, గిన్నారపు రాజేశ్, దేరంగుల పోషం పాల్గొన్నారు.

'కాంట్రాక్ట్ వ్యవస్థను పోషిస్తోంది'



సింగరేణి(కొత్తగూడెం): ప్రచారం చేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): దేశంలో పర్మనెంట్ ఉద్యోగాలను విస్మరించి కాంట్రాక్ట్ వ్యవస్థను పెంచిపోషిస్తోందని ఐఎఫ్‌టీయూ నేత అనురాధ అన్నారు. ఈ నెల 7న హైదరాబాద్‌లో తలపెట్టిన రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సోమవారం కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1.42 లక్షల కార్మికులు ఉన్న సింగరేణిలో ప్రస్తుతం 40 వేల మంది మాత్రమే పనిచేస్తున్నారని, 100 మందితో ప్రారంభమైన కాంట్రాక్ట్ వ్యవస్థ ప్రస్తుతం 56 విభాగాల్లో 32 వేలమందికి పెరిగారని, అందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే కారణమని పేర్కొన్నారు. కార్మికుడికి కనీసం పీఎఫ్, ఈఎస్ఐ, సమానపనికి సమాన వేతనం, పనిగంటల విధానం, బోనస్ సమకూర్చే పరిస్థితి లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో జె.సీతారామయ్య, గౌని నాగేశ్వరరావు, ఎస్.సంజీవ్, కరుణ, నాగలక్ష్మి, సంధ్య, కృష్ణ, నరసింహ, కొండల్‌రావు, రాధా, పుష్పరాజ్, మణెమ్మ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బోర్డు ఏర్పాటు చేయాలి

ఇల్లెందు: భవన నిర్మాణ రంగంలో పని చేసే కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షులు జి.అనురాధ డిమాండ్ చేశారు. సోమవారం ఇల్లెందులో గోవింద్ సెంటర్‌లోని పెన్షనర్ భవన్‌లో భవన నిర్మాణ రంగం కార్మికుల మండల సదస్సులో మాట్లాడారు. బొర్ర రమేశ్, కె.సారంగపాణి, జె.సీతారామయ్య, ఎండీ రాసుద్దీన్, తోడేటి నాగేశ్వరరావు, కె.శ్రీనివాస్, ఆర్.ఉపేందర్‌రావు పాల్గొన్నారు.

వరద ప్రాంతాల్లో పరిస్థితిపై సమీక్ష

సూపర్‌బజార్(కొత్తగూడెం): భారీ వర్షాలు, వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షించాలని ప్రభుత్వ శాఖాధికారులను కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆదేశించారు. హైదరాబాద్‌లో ఉన్న ఎమ్మెల్యే సోమవారం మున్సిపల్, ఆర్‌అండ్‌బీ, విద్యుత్, పంచాయతీరాజ్, పోలీస్, రెవెన్యూ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. కురుస్తున్న భారీ వర్షాలకు నియోజకవర్గంలోని పలు గ్రామాలు, బస్తీల్లో అంతర్గత రహదారులు దెబ్బతిన్నాయని తక్షణమే పునర్నిర్మాణం చేపట్టి పరిస్థితిని చక్కదిద్దాలని సూచించారు. దెబ్బతిన్న విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టాలన్నారు. అవసరమైన చోట వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, పంటల నష్టంపై సర్వే చేపట్టి నష్టం అంచనాలను ప్రభుత్వానికి నివేదించాలని, నిర్వాసితులుగా మారిన కుటుంబాలను తక్షణమే పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు.

నిమజ్జనానికి ఏర్పాట్లు షురూ..

- జాగ్రత్తలు పాటించాలంటున్న అధికారులు




వేణుగోపాల్‌నగర్‌లో విగ్రహాన్ని నిమజ్జనానికి తీసుకెళ్తున్న భక్తులు

కొత్తగూడెంటౌన్: వినాయకచవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కొందరు తమ వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలిస్తున్నారు. కొత్తగూడెంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో చిన్నాపెద్దవి కలిపి దాదాపు 500కు పైగా విగ్రహాలు కొలువుదీరాయి. ఈ నెల 6వ తేదీన నిమజ్జనానికి నిర్ణయించినా కొత్తగూడెం, పాల్వంచ, జూలూరుపాడు, సుజాతనగర్, విద్యానగర్‌కాలనీ, పాలకేంద్రం, రుద్రంపూర్, గౌతంపూర్‌కు చెందిన భక్తులు కొందరు ఇప్పటికే నిమజ్జనం మొదలుపెట్టారు. అయితే, నిమజ్జనం సమయాన ఊరేగింపులో విద్యుత్ తీగలు, ఇతర అంశాల్లో భక్తులు జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.

విద్యుత్ తీగలతో ప్రమాదం

ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. అలాగే, మండపాల్లో తాత్కాలిక విద్యుత్ కనెక్షన్లు తీసుకున్నారు. ఈ నేపథ్యాన వైర్ల విషయంలో అప్రతమత్తంగా ఉండాలి. నిమజ్జనానికి విగ్రహాన్ని తరలించే ముందు అధికారులు సూచించిన రూట్ మ్యాప్‌ను పాటించాలి. తద్వారా భద్రత విషయంలో ఇబ్బందులు ఉండవు. మండలంలో ముందస్తుగా నిపుణులతో విద్యుత్ కనెక్షన్ తొలగించి విగ్రహాన్ని వాహనంపైకి చేర్చాలి. అలాగే, మార్గమధ్యలోనూ వైర్లు ఉంటే జాగ్రత్త వహిస్తే ప్రశాంతంగా నిమజ్జనం పూర్తిచేసుకోవచ్చు.

తగిన జాగ్రత్తలు పాటించాలి



టూటౌన్ మండపాల నిర్వాహకులు పోలీసులకు సహకరించాలి, పూజలు, ఊరేగింపు సమయాన విద్యుత్, అగ్ని ప్రమాదాలు బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చూసుకోవాలి. ప్రమాదాలు ఎదురైతే డయల్ 100 లేదా 112 నంబర్లకు సమాచారం అందించాలి.

–డి.ప్రతాప్, సీఐ, కొత్తగూడెం